## బోనాల నిధుల కోసం దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులను స్వీకరిస్తున్న మెట్టుగూడ కార్పొరేటర్ సునీత

అడ్డగుట్ట, జూన్ 20: బోనాల జాతర సమీపిస్తున్న నేపథ్యంలో ఆలయాల నిధుల మంజూరు కోసం శుక్రవారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత నిర్వాహకుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మెట్టుగూడలోని కార్పొరేటర్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని ఆమె తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, జూన్ 20: టీఎస్ఎస్ పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కెవి సాయిబాబా టెంపుల్, డీడీకాలనీ, తిలక్‌నగర్, గోల్నాక ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అజామాబాద్ డివిజన్ ఏడీఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాయిబాబా టెంపుల్ ఫీడర్ పరిధిలోని శివం, సాయిబాబా కమాన్, ఆంధ్ర బ్యాంక్, వీహెచ్ నివాసం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు డీడీకాలనీ ఫీడర్ పరిధిలోని డీడీకాలనీ ఏ అండ్ బీ లైన్, డిగ్రీ కాలేజీ, గ్లాస్కో, హిల్టన్ కేఫ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిలక్‌నగర్, గోల్నాక ఫీడర్ల పరిధిలోని తిలక్‌నగర్ ఎక్స్‌రోడ్, ఛే నంబర్ ఎక్స్‌రోడ్, అంబర్‌పేట్ మెయిన్ రోడ్డు, జైపాల్ గార్డెన్, తులసీనగర్, తిరుమలనగర్, మారుతినగర్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

# విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలి

**● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

బేగంపేట్, జూన్ 20: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలని, అప్పుడే ఉన్నతస్థాయికి చేరుకోగలుగుతారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం నల్లగుట్టలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.26 లక్షల వ్యయంతో పూర్వవిద్యార్థి స్వర్ణలత జ్ఞాపకార్థం నిర్మించిన నూతన తరగతి గదిని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా వాచ్‌మన్ లేకపోవడం వల్ల పాఠశాల ముగిసిన తర్వాత పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు పాఠశాల ఆవరణలో మద్యం తాగడం వంటి అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని అక్కడే ఉన్న రాంగోపాల్‌పేట ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావును ఆదేశించారు. తమకు క్రీడా సామగ్రి కావాలని, ఖోఖో, వాలీబాల్ కోర్ట్ కావాలని, హ్యాండ్ వాష్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరగా 15 రోజుల్లో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యతోనే గౌరవం, గుర్తింపు లభిస్తాయని అన్నారు. తమ పిల్లలను ప్రయోజకులను చేయాలనే తల్లిదండ్రులు అనేక కష్టాలకు ఓర్చి తమ పిల్లలను పాఠశాలకు పంపిస్తున్నారని, మంచిగా చదువుకొని ఉన్నత స్థానంలో ఉండాలని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎంగా కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఇదే పాఠశాల పూర్వ విద్యార్థి స్వర్ణలత జ్ఞాపకార్థం నూతన తరగతి గదిని నిర్మించిన ఆమె భర్త నందకుమార్‌ను అభినందించారు. ఈ పాఠశాలలోని విద్యార్థులు క్రీడల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటారని తెలుసుకుని ప్రశంసించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు స్వరూప, కృష్ణమూర్తి, దాత నందకుమార్, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కిషోర్, ఆకుల హరికృష్ణ, సతీష్, కోటేశ్వర్‌గౌడ్, గోపిశెట్టి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

### అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

బన్సీలాల్‌పేట్: సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం బన్సీలాల్‌పేట డివిజన్‌లో పర్యటించి రూ.46.20లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ముందుగా భోలక్‌పూర్‌లోని సుందర్‌నగర్, పెంటయ్యబస్తీలో రూ.37లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా తమ బస్తీలో బోర్‌వెల్ మరమ్మతు చేయాలని, వీధిలైట్లు వెలగడం లేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బోయిగూడలోని మల్లికార్జున స్వామి ఆలయం సమీపంలో రూ.9.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. గొల్ల కొమరయ్య కాలనీ వద్ద మ్యాన్ హోల్స్ పొంగి రోడ్డుపై మురుగు ప్రవహిస్తున్న కారణంగా ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పూడిక తొలగింపు చేపట్టి మ్యాన్‌హోల్ ఓవర్ ఫ్లోను నివారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, పద్మారావునగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్, డీసీ డాకునాయక్, జలమండలి డీజీఎం ఆశిష్, బన్సీలాల్‌పేట పార్టీ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నేత లు లక్ష్మిపతి, ప్రేమ్‌కుమార్, ఏసూరి మహేష్, మహేందర్, శ్రీకాంత్ రెడ్డి, కుమార్‌యాదవ్, వెంకట్ పాల్గొన్నారు. ఇటీవల మరణించిన సుందరయ్య కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సైకిల్ షాప్ నర్సింహ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి, ఆయన నివాసంలో చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

### గోపాల్ దాస్ మఠం సందర్శన

బన్సీలాల్‌పేట్‌లోని గోపాల్‌దాస్ భజన మండలి మఠంను ఎమ్మె ల్యే సందర్శించారు. మఠానికి షెడ్డు నిర్మించాలని, ఫ్లోరింగ్ చేపట్టాలని, లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ పలు సమస్యలతో కూడిన వినతిపత్రం మఠం పీఠాధిపతి డి.శంకర్ బాబు అందజేశారు. కాగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

# బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి



బేగంపేట్, జూన్ 20: తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే ఆషాఢ బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని సనత్ నగర్‌ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. పాతబస్తీలోని ఉమ్మడి దేవాలయాల కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన గోపిశెట్టి రాఘవేందర్‌తో పాటు వివిధ ఆలయాల కమిటీ చైర్మన్లు శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసానిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచ దేశాలలో ప్రత్యేక గుర్తింపు ఉన్నదని, వాటిలో ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాలు ఒకటని పేర్కొన్నారు. సుమారు నెల రోజులపాటు బోనాల ఉత్సవాలతో నగరం మొత్తం సందడిగా ఉంటుందని గుర్తుచేశారు. లక్షలాదిగా వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉప్పుగూడ మహంకాళి ఆలయ చైర్మన్ మధుగౌడ్, బంగారు మైసమ్మ ఆలయ చైర్మన్ మధుసూదన్‌యాదవ్, సభ్యులు భవానిశంకర్, గుర్నాథరెడ్డి, ఆనంద్, శంకర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

## అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు



హుందాబాగ్ బస్తీలో వాటర్‌ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, జూన్ 20: ప్రజా అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. కవాడిగూడ డివిజన్ పరిధిలోని ఏవీ కళాశాల సమీపంలోని హుందాబాగ్ బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు స్థానిక దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను శుక్రవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించేందుకు అంకిత భావంతో పనిచేస్తున్నానని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, రాజేష్, స్థానిక బస్తీ నాయకులు మక్కాల నరేందర్, ఎం.కృష్ణ, మక్కాల నాగేస్, పి.కృష్ణ, పి.యాదగిరి, ఇ.రాజు తదితరులు పాల్గొన్నారు.

## బోయబస్తీ కమ్యూనిటీ హాల్‌కు.. ఆరోగ్య కేంద్రం

అడ్డగుట్ట, జూన్ 20: అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రాన్ని తుకారంగేట్ బోయబస్తీలోని కమ్యూనిటీ హాల్‌కు మార్చుతున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీ శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న కేంద్రం స్థలంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అడ్డగుట్ట ప్రజలకు వైద్య సేవలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బోయబస్తీకి మార్చామని అన్నారు. దవాఖాన నిర్మాణం పూర్తయ్యేంతవరకు బోయ బస్తీ కమ్యూనిటీ హాల్లోనే వైద్య సేవలు కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు.

## శ్రీనివాస్‌నగర్‌లో చెట్లకొమ్మల తొలగింపు



శ్రీనివాస్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమ తదితరులు

సికింద్రాబాద్, జూన్ 20: శ్రీనివాస్‌నగర్‌లో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను స్థానికుల ఫిర్యాదు మేరకు సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ పరిశీలించారు. అనంతరం సిబ్బందితో తొలగింపజేశారు. స్థానికులు రోడ్డుకు ఇరువైపులా చెట్టుకొమ్మలు పెరిగాయని సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆమె హార్టికల్చర్ శాఖ అధికారుల సమన్వయంతో చెట్టు కొమ్మలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం స్థానికులతో ఆమె మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శైలెందర్, రవీందర్ సాగర్, భాస్కర్, స్థానికులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

అడ్డగుట్ట, జూన్ 20: రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో చిలకలగూడ దూద్ బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా క్లబ్ ప్రెసిడెంట్ బాలకోటి రెడ్డి, డైరెక్టర్ రాధాకృష్ణ హాజరై విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి వారిని శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలను తెలియజేశారు


## అడ్డగుట్ట అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, జూన్ 20: సమస్యల రహిత డివిజన్‌గా అడ్డగుట్టను తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి తెలిపారు. శుక్రవారం శాస్త్రినగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సాకారంతో డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఆమె అన్నారు. ప్రజా సమస్యల పట్ల సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆమె సూచించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ తివారి, బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, నక్క మధు, మనోహర్, శ్రీనివాస్‌గౌడ్, ఎల్లయ్య, దాసరి శ్రీనివాస్, గణేష్, దేవయ్య, మల్లేష్, నర్సింగ్, మోహన్, అంజమ్మ, చిన్న, భాగ్య, సూపర్ వైజర్ సలీం, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి



తహసీల్దార్ భీమయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అడ్డగుట్ట, జూన్ 20: అర్హులందరికీ కొత్త పెన్షన్లను తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ మారేడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్‌కు సీపీఎం నాయకులు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. సుమారు రెండు సంవత్సరాలుగా వికలాంగుల, వితంతు ఓల్డ్ ఏజ్ పెన్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటి మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలపాలని ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌ను కోరారు. పెన్షన్‌పై ఆధారపడి బతికే వారికి ఆ ఆధారం లేకుండా ప్రభుత్వం చేస్తుందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జోన్ నాయకులు ఎం.అజయ్‌బాబు, మల్లేష్, శారద తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్‌తో పేద కుటుంబాలకు భరోసా




బాధితురాలికి సీఎంఆర్‌ఎఫ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి

బేగంపేట్ జూన్ 20: సీఎంఆర్‌ఎఫ్‌తో పేద కుటుంబాలకు భరోసా ఇస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. ఇటీవల నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన పలువురు అనారోగ్యానికి గురయ్యారు. ఆయా పేద కుటుంబాలకు శుక్రవారం బేగంపేటలోని రామానంద తీర్థ మెమోరియల్ కమిటీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2లక్షల విలువైన చెక్కులను అందజేశారు. లబ్ధిదారుల్లో వెంకటయ్య, శేషమ్మ, ఇంద్రమ్మ, పాడెండ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వాణీదేవి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అత్యవసర సమయంలో ఆశాజ్యోతి లాంటిది అని అన్నారు. వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితుల్లో ఈ నిధి ఎంతో ఉపశమనం కలిగిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వరకు చేర్చడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని ఆమె అన్నారు. ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడటం మనందరి బాధ్యత అని సూచించారు.

## అనారోగ్యంతో రైల్లో వృద్ధుడు మృతి

మారేడ్‌పల్లి, జులై 20: అనారోగ్యంతో ఓ వృద్ధుడు రైల్లో మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతానికి చెందిన సూర్యనారాయణ మూర్తి (70) స్థానికంగా కిరాణం దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైల్లో సికింద్రాబాద్‌కు వస్తున్న క్రమంలో మృతుడు సూర్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అలరించిన సినీ సంగీత విభావరి



కళాకారులను సత్కరిస్తున్న వకులాభరణం కృష్ణమోహన్

ముషీరాబాద్, జూన్ 20: స్వర కళ్యాణి ఆర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి పలువురిని అలరించింది. గాయకులు ఆలపించిన మధుర గీతాలు శ్రోతలను రంజింపజేశాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంగీతం అనేది కేవలం వినోదం కోసం కాదు, అది మనసును తాకే మృదుత్వానికి, ఆధ్యాత్మిక అనుభూతికి నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ రామరాజు, కిన్నెర రఘురామ్, శోభారాణి, పుత్తూరి రంగారావు, సీహెచ్ త్రినాథరావు, గాయని సురేఖ, రామకృష్ణ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

## తొలి తెలుగు జాతీయ కవి గరిమెళ్ళ



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ నారాయణ

ముషీరాబాద్, జూన్ 20: తెల్ల దొరలను గడగడ లాడించిన గరిమెళ్ళ సత్యనారాయణ తొలి తెలుగు జాతీయ కవి అని ప్రముఖ జర్నలిస్ట్, హాస్య అవధాని శంకర నారాయణ అన్నారు. త్యాగరాయ గానసభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గరిమెళ్ళ సత్యనారాయణ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శంకర నారాయణ మాట్లాడుతూ గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళంలోని కుగ్రామంలో పుట్టి తన గీతాలు, రచనల ద్వారా ప్రసిద్ధి పొందారని చెప్పారు. నాటి పాలకులకు గరిమెళ్ళ రచించిన దేశభక్తి గీతాల వల్ల తమపై ప్రజలు తిరుగుబాటు చేస్తారన్న భయం కలిగి ఆయనకు జైలు శిక్ష వేశారని పేర్కొన్నారు. పాటల వల్ల జైలుకు వెళ్లిన తొలి కవి గరిమెళ్ళ అని, గాంధీ కోరిక మేరకు దళితులపై వివక్షతకు వ్యతిరేకంగా పాటలు రాసి పాడి ప్రచారం చేశారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో వంశీ రామరాజు, కథక్ కళాక్షేత్ర నిర్వాహకుడు కథక్ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సెట్విన్ కోర్సులకు దరఖాస్తులు



కవాడిగూడ, జూన్ 20: ముషీరాబాద్ సెట్విన్‌లో ఉపాధి రంగ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సెట్విన్ ఇన్‌చార్జి సత్యవతి తెలిపారు. భోలక్‌పూర్ ఇందిరానగర్‌లోని సెట్విన్‌లో శుక్రవారం విద్యార్థులకు వివిధ రంగాల్లో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు ఉపాధి కోర్సులకు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. మూడు నుంచి ఆరు నెలల వరకు శిక్షణ అందిస్తామని చెప్పారు. ఉపాధి రంగ కోర్సులపై ఆసక్తి ఉన్నవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. మెకానిజం, ల్యాప్‌టాప్ సర్వీసింగ్, ఎంఎస్ ఆఫీస్, అకౌంటింగ్ ప్యాకేజీ, కంప్యూటర్ హార్డ్‌వేర్, స్పోకెన్ ఇంగ్లిష్, ప్రీప్రైమరీ టీచర్ ట్రైనింగ్, ఎలక్ట్రీషియన్, రిఫ్రిజిరేటర్, ఎయిర్‌కండీషన్, మొబైల్ సర్వీస్, సీసీటీవీ, ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్, ఫేషన్ డిజైనింగ్, గర్మెంట్ మేకింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్, బ్యూటీషియన్, హెల్త్‌కేర్ అండ్ స్పా రంగాల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. తమ వద్ద శిక్షణ పొందిన వారికి తప్పనిసరి ఉపాధి అవకాశాలను కల్పిస్తామని చెప్పారు. వివరాల కోసం 98854 29536, 91105 34518 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సెట్విన్ ఇన్‌చార్జి సత్యవతి తెలిపారు.

## కేవీలో అడ్మిషన్ ఇప్పిస్తానని మోసం

బొల్లారం, జూన్ 20: బోయిన్పల్లి కేంద్రీయ విద్యాలయం పాఠశాలలో అడ్మిషన్ ఇప్పిస్తానని ఓ వ్యక్తి మోసం చేసిన సంఘటన బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ నాగారం ప్రాంతానికి చెందిన ఇ.స్రవంతి బోయిన్పల్లి కేంద్రీయ విద్యాలయాన్ని గత మార్చిలో సందర్శించింది. ఈ క్రమంలో అదే పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అమిత్‌కుమార్ తాను మీ పిల్లలకు సీట్లు ఇప్పిస్తానని చెప్పి సదురు మహిళా నంబర్ తీసుకొని తనను సంప్రదించాలని కోరాడు. ఆయన మాటలు నమ్మిన స్రవంతి అతనికి కొంత నగదును ఇచ్చింది. అడ్మిషన్ల సమయానికి లిస్టులో పేరు లేకపోవడంతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా అసలు విషయం బయటపడింది. తను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టగా వేరే వ్యక్తుల ద్వారా కూడా మొత్తం రూ.5,80000 నగదు తీసుకొని మోసం చేసినట్లుగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సాదాసీదాగా సాగిన కంటోన్మెంట్ బోర్డు సమావేశం

కంటోన్మెంట్,జూన్ 20: కంటోన్మెంట్ బోర్డు నూతన అధ్యక్షుడిగా బ్రిగేడియర్ రాజీవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బోర్డు నియమ నిబంధనలకు కట్టుబడి ఉంటూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తానని పాలక మండలి సమావేశంలో ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్, నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ సమక్షంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. తిరుమలగిరి లేక్ అభివృద్ధికి ఎన్‌ఓసీ ఇచ్చిన మాదిరిగానే బోయిన్పల్లి రామన్నకుంట చెరువు అధునీకరణకు ఎన్‌ఓసీ జారీ చేస్తే రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేయిస్తామని ఎమ్మెల్యే సూచించారు. బోర్డు పరిధిలో 1 ఎంజీడీ అదనపు మంచినీటి నిల్వ సామర్థ్యానికి, 3 రిజర్వాయర్ల నిర్మాణంపై చర్చించారు. నివేదికను అందజేస్తే హెచ్‌ఎండీఏతో చర్చించి రిజర్వాయర్ల పరసులు చేయిస్తామన్నారు. భవన నిర్మాణాల్లో కొందరు నింబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తుంటే వారు నోటీసులు జారీ చేయడంతో కోర్టు ద్వారా స్టే తెచ్చుకొని నిర్మాణం పనులు సాగిస్తున్నారని వాటిపై బోర్డు అడ్వకేట్ ప్రత్యేక చొరవ తీసుకునే విధంగా చూడాలన్నారు. మడ్ ఫోర్ట్ ప్లే గ్రౌండ్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎన్‌ఓసీ ఇస్తే తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు తెచ్చి పనులు వేగవంతం చేయిస్తామన్నారు. దీంతో పాటు వెటర్నరీ ఆసుపత్రి నిర్మాణానికి బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు దేవేందర్, రాజ్‌కుమార్, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగకు నిధులు కేటాయించాలి

సికింద్రాబాద్, జూన్ 20: వచ్చే నెల జరగనున్న ఆషాఢ బోనాల జాతరను పురస్కరించుకొని సికింద్రాబాద్ పరిధిలోని ఆయా దేవాలయాల వద్ద అభివృద్ధి పనులకు గాను జీహెచ్‌ఎంసీ తరపున రూ.10కోట్లు మంజూరు చేయాలనీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను శుక్రవారం సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో కలిసి సమస్యలు వివరించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి అధికారులకు తగు విధంగా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశాలు ఇచ్చినట్లు సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలరాజ్‌యాదవ్, సునీల్‌ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, అశోక్‌చారి, రవీందర్‌సాగర్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్‌లో పేదలకు 25 శాతం ఉచిత సీట్లు ఇవ్వాలి

బన్సీలాల్‌పేట్, జూన్ 20: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆశయాలు, లక్ష్యాలు నెరవేరడం లేదని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్(టీఆర్ఎల్డీ) రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ విమర్శించారు. శుక్రవారం కవాడిగూడ లోని టీఆర్‌ఎల్డీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర చట్టం ప్రకారం నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇవ్వాల్సిన 25 శాతం సీట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. ఈ పథకాన్ని అమలు చేస్తే 9 లక్షల మంది పిల్లలకు మేలు జరుగుతుందన్నారు. ఈ నెల 23న ఇందిరాపార్కు వద్ద దీక్ష చేపడుతున్నామని, అన్ని పక్షాలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని వెంటనే ప్రారంభించాలని, నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరారు. నకిలీ విత్తనాలతో రైతులు ప్రతి ఏటా నష్టపోతున్నారని, వీరికి ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. తెలంగాణ సోయి లేని మంత్రులను, కమిషన్ తీసుకొని బిల్లులు మంజూరు చేస్తున్న మంత్రులను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు కపిలవాయి ఇందిర మాట్లాడుతూ తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసిన అమరుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం, ఉద్యోగం, పింఛన్, భూమి ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఉద్యమంలో ప్రజలను చైతన్య పరిచిన విమలక్క, మధుప్రియ, వందేమాతరం శ్రీనివాస్ లాంటి కళాకారులను మరిచిపోవడం సరికాదన్నారు. స్మగ్లింగ్ ను ప్రేరేపించే సినిమాలకు అవార్డులు ఇవ్వడం విచారకరమన్నారు. సమావేశంలో నాయకులు కిన్నెర సిద్దార్థ, శాంతి, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, అజాజ్ అహ్మద్, విశాల్, మల్లేశ్, రంగయ్య పాల్గొన్నారు.